గుబాళించిన పూలసింగిడి

- ఘనంగా ఎంగిలిపూల బతుకమ్మ
- ప్రారంభమైన ఉత్సవాలు
- పల్లెలు, పట్టణాల్లో నెలకొన్న సందడి

'ఒక్కేసి పువ్వేసి చందమామ.. ఒక్క జాములాయే చందమామ.. రెండేసి పువ్వేసి చందమామ.. రెండు జాములాయే చందమామ, చిత్తూ చిత్తుల బొమ్మ శివుని ముద్దుల గుమ్మా.. బంగారు పువ్వు దొరికెనమ్మో ఈ వాడలోనా..' అంటూ మహిళలు బతుకమ్మ పాటలతో పల్లెలు, పట్టణాల్లో హోరెత్తాయి. తెలంగాణ సంస్కృతిని ప్రతిబింబించే బతుకమ్మ వేడుకలు శనివారం ఎంగిలిపూల బతుకమ్మతో ప్రారంభమయ్యాయి. మహిళలు, యువతులు, చిన్నారులు నూతన వస్త్రాలు ధరించి తీరొక్క పూలతో అందంగా పేర్చిన బతుకమ్మలతో సాయంత్రం ప్రధాన కూడళ్లకు చేరుకున్నారు. బతుకమ్మలన్నింటినీ మధ్యలో పెట్టి వాటి చుట్టూ ప్రదక్షణం చేస్తూ బతుకమ్మ పాటలు పాడుతూ ఆనందోత్సాహాలతో గడిపారు. యువతులు దాండియా పాటలతో నృత్యాలు చేస్తూ, కోలాటాలు వేస్తూ వేడుక చేసుకున్నారు. అనంతరం ఆయా గ్రామాల్లో అందుబాటులో ఉన్న జలాశయాల్లో నిమజ్జనం చేసి, వాయినాలు ఇచ్చిపుచ్చుకున్నారు.

– సిరిసిల్లటౌన్/ వేములవాడ/సిరిసిల్లఅర్బన్/తంగళ్లపల్లి/ముస్తాబాద్/గంభీరావుపేట/ఎల్లారెడ్డిపేట/వీర్నపల్లి/వేములవాడఅర్బన్/ బోయినపల్లి/కోనరావుపేట/వేములవాడరూరల్/రుద్రంగి/చందుర్తి


సిరిసిల్లఅర్బన్: రగుడులో..


ముస్తాబాద్ జెడ్పీ స్కూల్లో..


బోయినపల్లిలో..


డ్రెస్ కోడ్‌తో బతుకమ్మ సన్నిధిలో


ఎల్లారెడ్డిపేటలో ..


తంగళ్లపల్లిలో..


గంభీరావుపేట: బతుకమ్మ ఆడుతున్న మహిళలు


సిరిసిల్ల వెంకన్న గుడి ముందు..


నిమజ్జనం చేస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ అరుణ


వీర్నపల్లి: బతుకమ్మ ఆడుతున్న మహిళలు


బతుకమ్మలతో మాజీ జెడ్పీ చైర్‌పర్సన్ తుల ఉమ


వేములవాడరూరల్: లింగంపల్లిలో..


ఒకే రకం చీరలతో తిప్పాపూర్ మహిళలు


చందుర్తిలో..

పితృదేవతలకు బియ్యం సమర్పణ

కోనరావుపేట: మండలంలోని గ్రామాల్లో పితృఅమావాస్య వేడుకలు ఘనంగా నిర్వహించారు. గ్రామాల్లోని ప్రజలు తమ పితృదేవతల పేరిట బ్రాహ్మణులకు బియ్యం, కూరగాయలు, పప్పులు అందజేసి మొక్కులు తీర్చుకున్నారు. బ్రాహ్మణులకు బియ్యం, సామగ్రి ఇస్తే తమ పితృదేవతలకు చేరినట్లు భావిస్తారు. మండలంలోని అన్ని గ్రామాల్లో వేడుకలు నిర్వహించారు.



బీఆర్‌ఎస్‌లో చేరిన యువకులు

కోనరావుపేట: మండలం కొలనూర్ గ్రామానికి చెందిన యువకులు చల్మెడ లక్ష్మీనర్సింహారావు సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. కొలనూర్ సింగిల్‌విండో చైర్మన్ సంకినేని రాంమోహన్‌రావు ఆధ్వర్యంలో చేరిన యువకులకు కండువాలు కప్పి ఆహ్వానించారు. వీరిలో జలగం అరవింద్‌రావు, బుర్ర సందీప్‌గౌడ్, తాళ్లపెల్లి రఘురాములు, ఓరుగంటి అర్జున్, మామిండ్ల అరవింద్, యాట సాయి తదితరులు ఉన్నారు.


బీఆర్‌ఎస్‌లో చేరుతున్న యువకులు

రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం

వేములవాడ: టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి పొన్నాల లక్ష్మయ్యపై చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ వేములవాడ పట్టణ మున్నూరు కాపు సంఘం అధ్యక్షుడు బింగి శ్రీనివాస్ ఆధ్వర్యంలో సంఘం నాయకులు శనివారం పట్టణంలోని తెలంగాణ చౌక్‌లో రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. పొన్నాల లక్ష్మయ్యకు బేషరతుగా క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. మున్నూరుకాపు సంఘం నాయకులు, కుల బాంధవులు పాల్గొన్నారు.


దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు

ఆరు గ్యారంటీలతో అధికారంలోకి వస్తాం

ఎల్లారెడ్డిపేట: కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారంటీలతో ఈ ఎన్నికల్లో విజయదుందుభి మోగించి అధికారంలోకి రావడం ఖాయమని ఆ పార్టీ బ్లాక్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య, జిల్లా ఉపాధ్యక్షులు ఎస్కే గౌస్ అన్నారు. మండల కేంద్రంతో పాటు మండలంలోని నారాయణపూర్, రాచర్లగొల్లపల్లిలో శనివారం గడపగడపకు వెళ్లి ఆరు గ్యారంటీ కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అవినీతి పాలనకు ప్రజలు చరమగీతం పాడడానికి సిద్ధమయ్యారన్నారు. కుటుంబ గడీల పాలనకు రోజులు దగ్గరపడ్డాయన్నారు. ఎన్ని జిమ్మిక్కులు చేసిన అంతిమ విజయం కాంగ్రెస్‌దే అన్నారు. తమ పార్టీ ప్రకటించిన ఆరు గ్యారంటీ హామీలకు గ్రామాల్లో మంచి స్పందన వస్తుందన్నారు.మండల అధ్యక్షుడు సద్ది లక్ష్మారెడ్డి, జిల్లా కార్యదర్శి పందిర్ల లింగంగౌడ్, నాయకులు పాల్గొన్నారు.


ప్రచారం చేస్తున్న నాయకులు

నిరుపేదలకు అందని పథకాలు

వేములవాడ అర్బన్: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు నిరుపేదలకు అందలేదని సీపీఐ జిల్లా కార్యవర్గసభ్యుడు కడారి రాములు అన్నారు. వేములవాడ పట్టణంలోని అయన ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ ప్రభుత్వం ఇప్పటి వరకు ఎంతమంది నిరుపేదలకు డబుల్ బెడ్రూం ఇళ్లు, బీసీ బంధు, దళిత బంధు ఇచ్చినరో చెప్పాలని డిమాండ్ చేశారు. వేములవాడ నియోజవర్గం అభివృద్ధిలో వెనుకబడిందన్నారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్, గణేశ్, దుర్గయ్య పాల్గొన్నారు.


మాట్లాడుతున్న రాములు

యువకుడికి సన్మానం


సన్మానం చేస్తున్న గ్రామస్తులు

చందుర్తి: పోలీస్ కానిస్టేబుల్‌గా ఎంపికైన మండలంలోని కిష్టంపేట గ్రామానికి గంగుల శ్రీకాంత్‌ను గ్రామ సర్పంచ్ అంబరి కల్పనతో పాటు గ్రామ యువజన సంఘాల సభ్యులు శనివారం సన్మానించారు. మాజీ సర్పంచులు బానాల గంగారెడ్డి, కొమ్ము రమేశ్, నాయకులు పాల్గొన్నారు.

పండుగ షాపింగ్

- రోడ్‌సైడ్ బిజినెస్‌కు గిరాకీ
- లబ్ధిపొందుతున్న చిరువ్యాపారులు
- కిక్కిరిసిపోతున్న మార్కెట్లు

సండే స్పెషల్









సిరిసిల్లఅర్బన్: తెలంగాణలో అతిపెద్ద పండుగలైన బతుకమ్మ, దసరా పర్వదినాన్ని పురస్కరించుకొని జిల్లా కేంద్రంలో ఎక్కడ చూసినా సందడి నెలకొంది. పదిహేను రోజుల నుంచి కొనుగోలుదారులతో మార్కెట్లన్నీ కిటకిట లాడుతున్నాయి. ఈ పండుగతో బడా వ్యాపారస్తులతో కాకుండా వీధి వ్యాపారులు సైతం ఉపాధి పొందుతున్నారు. ముఖ్యంగా మహిళలకు సంబంధించి ఎంపోరియం, ఆభరణాలు తదితర వస్తువులను దూర ప్రాంతాల నుంచి హోల్‌సెల్‌గా తీసుకొచ్చి పట్టణంలో రోడ్డు పక్కన దుకాణాలు ఏర్పాటు చేసుకోని విక్రయిస్తున్నారు. ఇవి అతి తక్కువ ధరలో లభించడంతో సామాన్య ప్రజలు కొనుగోలు చేసేందుకు ఎక్కువ ఆసక్తి చూపిస్తున్నారు. దీంతో పండుగ వేళ ఎంతో మంది చిరువ్యాపారులు ఉపాధి పొందుతున్నారు.

వెరైటీ మోడల్స్‌లో..

పండుగలను దృష్టిలో పెట్టుకొని అతివలు ఆసక్తి చూపించే ఆభరణాలను వ్యాపారస్తులు హోల్‌సెల్‌గా తీసుకొచ్చి విక్రయిస్తున్నారు. రోల్డ్‌గోల్డ్, గోల్డ్ ప్లెటెడ్ వంటి ఆభరణాలు వెరైటీ డిజైన్లలో లభ్యమవుతున్నాయి. గాజులు, మ్మలు, మాటీలు, వంకీలు, ఉంగరాలు, బ్రాస్‌లెట్‌లు, వడ్డానాలు, తదితర ఆభరణాలు లభిస్తున్నాయి. మెడలో వేసుకునే చైన్‌లు, లాకెట్, లాంగ్ చైన్, నెక్లెస్‌లు వంటి అలకంరణ వస్తువులు పలు రకాల మోడళ్లలో మార్కెట్లో దొరుకుతున్నాయి. కాస్మోటిక్స్, పూసల దండలు, హెయర్‌రింగ్, బ్యాండ్‌లు, జడ బిల్లలు, పూసల నెక్లెస్‌లు తదితర వాటిని విక్రయిస్తున్నారు. సిరిసిల్ల పట్టణంలోని మార్కెట్ ఏరియా, గాంధీ చౌక్, విమల్ టాకీస్ రోడ్, పెద్దబజార్ తదితర ప్రాంతాల్లో రోడ్డు పక్కన బండ్లు పెట్టుకొని అమ్ముకుంటూ పొట్ట పోసుకుంటున్నారు. ఉపాధి పోందుతున్నారు.


గాజులు కోనుగోలు చేస్తున్న మహిళలు

అందుబాటు ధరల్లో...

పెద్ద పెద్ద దుకాణాల్లో లభించే వస్తువులు సైతం చిరు వ్యాపారుల వద్ద లభిస్తుండడంతో సామాన్య ప్రజలు కొనేందుకు ఆసక్తి చూపిస్తున్నారు. అందరికి అందుబాటులో సరసమైన ధరలలో కాస్మోటిక్స్, ఎంపోరియం వస్తువలు, ఆభరణాలు లభిస్తున్నాయి. మోడళ్లను బట్టి ధరలు గాజులు రూ.50 నుంచి రూ.500కు పైగా ఉండగా, కమ్మలు, నెక్లెస్ వంటి రూ.100 నుంచి రూ.వెయ్యి వరకు ఉన్నట్లు వ్యాపారస్తులు పేర్కొన్నారు. ఇవే గాక చైన్‌లు, పట్టీలు, రింగ్, నెయిల్‌పాలీష్‌లు తదితర వస్తువులు సరసైన ధరల్లో అందుబాటులో ఉన్నాయి.

పదేళ్లుగా వ్యాపారం



మాకు వేములవాడలో దుకాణం ఉంది. కానీ ప్రతి సంవత్సరం బతుకమ్మ పండుగ సందర్భంగా సిరిసిల్లలో ఎంపోరియంకు సంబంధించి దుకాణాన్ని ఏర్పాటు చేసి వ్యాపారం నిర్వహిస్తుంటాం. పండుగ సందర్భంగా మహిళల కోసం కొత్త డిజైన్లు తీసుకొచ్చాం. వయస్సును బట్టి మహిళకు కమ్మలు, గాజులు, మాటీలు, తదితర వస్తువులను విక్రయిస్తున్నాం. – గుమ్మడి రామకృష్ణ, చిరువ్యాపారి

అన్ని రకాల మోడళ్లు లభ్యం



పండుగ సందర్భంగా హైదరాబాద్, రాజస్థాన్ నుంచి మహిళలకు సంబంధించి ఎంపోరియం వస్తువులు, ఆభరణాలను తీసుకువచ్చి విక్రయిస్తున్నాం. పెద్ద పెద్ద దుకాణాల్లో లభించినట్టుగానే మా దగ్గర కూడా అన్ని రకాల చైన్లు, రింగ్‌లు, కాస్మోటిక్ వస్తువులు లభ్యమవుతున్నాయి. గిరాకీ పెరుగుతోంది. – వాజీద్, చిరువ్యాపారి

సీఎం కేసీఆర్ సభను విజయవంతం చేయాలి


సన్నాహక సమావేశంలో నాయకులు

ఎల్లారెడ్డిపేట: సిరిసిల్ల జిల్లా కేంద్రంలో ఈ నెల 17న నిర్వహించ తలపెట్టిన ప్రజా ఆశీర్వాద సభకు మండలం నుంచి 16వేల మందిని తరలిస్తున్నట్లు జెడ్పీటీసీ చీటీ లక్ష్మణ్‌రావు, పార్టీ మండల అధ్యక్షులు వరుస కృష్ణహరి,ఏఎంసీ చైర్మన్ ఎలుసాని మోహన్‌కుమార్ అన్నారు. ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లగుండారం, హరిదాస్‌నగర్, రాగట్లపల్లి, పదిర గ్రామాల్లో కార్యకర్తలతో శనివారం సన్నాహక సమావేశంలో మాట్లాడుతూ నిరుపేదలకు సంక్షేమ పథకాలు దరిచేరడానికి మూడోసారి ముచ్చటగా కేసీఆర్‌ను సీఎంగా చేయాలన్నారు. కార్యక్రమంలో సింగిల్‌విండో చైర్మన్ గుండారపు కృష్ణారెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

వీర్నపల్లిలో..

వీర్నపల్లి: ప్రజా ఆశీర్వాద సభను విజయవంతం చేయాలని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు గుజ్జుల రాజిరెడ్డి, ఏఎంసీ చైర్మన్ రాజిరెడ్డి కోరారు. జెడ్పీకోఆప్షన్ సభ్యుడు చంద్‌పాషా, ఏఎంసీ వైస్‌చైర్మన్ భూక్య తులసీరాం నాయక్, బీఆర్‌ఎస్ మహిళా విభాగం నాయకులు రేణుక, సరిత, నాయకులు కవిత, పద్మ, రాధ, నర్సవ్వ, సంతోష, లక్ష్మీ, రాజవ్వ పాల్గొన్నారు.

ఆది శ్రీనివాస్‌ను విమర్శించే అర్హత లేదు

కోనరావుపేట: కొన్నేళ్ల నుంచి స్థానికంగా ఉంటూ ప్రజలతో మమేకమవుతున్న డీసీసీ అధ్యక్షుడు ఆది శ్రీనివాస్‌ను విమర్శించే అర్హత బీఆర్‌ఎస్ అభ్యర్థి చల్మెడ లక్ష్మీనర్సింహారావుకు లేదని కాంగ్రెస్ యూత్ అధ్యక్షుడు బొర్ర రవీందర్ అన్నారు. స్థానిక విలేకరులతో మాట్లాడుతూ 2009, 2014లో కరీంనగర్ ఎన్నికల్లో ఓటమిపాలైన చల్మెడ ఆది శ్రీనివాస్ గురించి మాట్లాడే స్థాయి కాదన్నారు. కార్యక్రమంలో యూత్ నాయకులు రాస రవీందర్, దినేష్, కార్తీక్‌గౌడ్, అనిల్, సాయి, వెంకటేశ్, బండి ప్రభాకర్ పాల్గొన్నారు.

ఏఎంసీ పాలకవర్గానికి సన్మానం

వీర్నపల్లి: నూతనంగా ఏర్పడిన వీర్నపల్లి ఏఎంసీ పాలకవర్గాన్ని బీఆర్‌ఎస్ మహిళా విభాగం అధ్యక్షురాలు గుగులోత్ కళ ఆధ్వర్యంలో శనివారం సన్మానించారు. కమిటీ చైర్మన్ రాజిరెడ్డి, వైస్‌చైర్మన్ తుల సీరామ్, డైరెక్టర్లను శాలువాలతో సత్కరించారు.